## క్లుప్తంగా

### కేశవనాథ స్వామి గ్రంథాలయం ప్రారంభం


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మణ్‌రావు

**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో కేశవనాథ స్వామి గ్రంథాలయాన్ని బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంఘం అధ్యక్షుడు వైరాగడె మనోజ్ సమక్షంలో రిటైర్డ్ హెచ్‌ఎం వారణాసి లక్ష్మణ్‌రావు రిబ్బన కట్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం శుభసూచకమన్నారు. సంఘం ప్రతినిధులు నిమ్మకంటి సుగుణాకర్‌రావు, అభయ్ ఆచార్య, ప్రదీప్, గోపాల్, వినోద్ మసాదె, పద్మాకర్, అశోక్, రాజేశ్వర్, నరేష్, తిరుమల్‌రావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

### సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ

**దహెగాం:** మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈజీఎస్ కింద మండల వ్యాప్తంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం కోసం కోటి రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. మండల కేంద్రంలో రెండు సీసీ రోడ్లు, ఒక డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ చేశామని పేర్కొన్నారు. సహకార సంఘం చైర్మన్ కోండ్ర తిరుపతిగౌడ్, వైస్‌చైర్మన్ రాపర్తి ధనుంజయ్, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు..

**ఆసిఫాబాద్‌అర్బన్:** బెజ్జూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనం ఎదుట డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాధవీలత, ఎంపీవో రమేశ్ రెడ్డి, ఎస్సై విక్రమ్ నాయకులు పాల్గొన్నారు.

### పుస్తకాలు అందజేత

**ఆసిఫాబాద్‌రూరల్:** విద్యార్థుల పఠన నైపుణ్యం పెంచడం కోసం పిల్లలకు కథల పుస్తకాలు పంపిణీ చేసినట్లు సీవైడీపీ సంస్థ సభ్యులు అంబరీష్, రవీందర్ అన్నారు. బుధవారం మండలంలోని వట్టివాగు కాలనీలోని దిశ మోడల్ స్కూల్ విద్యార్థులకు కథల పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు పఠన నైపుణ్యం పెంచేందుకు కథలు, గేయాలు చదివించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శంకర్, ఏఎంసీ చైర్మన్ మానిక్ రావు, గ్రామ పటేల్ బొజ్జిరావు తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు

**లింగాపూర్:** సిర్పూర్ (యూ), జైనూర్, లింగాపూర్ మండలాల పరిధిలో అడవి జంతువులను వేటాడేందుకు ఎవరైనా విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని సీఐ అంజయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరెంట్ తీగలు అమర్చినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.
**సిర్పూర్(టి):** గ్రామాల్లోని ప్రజలు అటవీ ప్రాంతాల్లో, పంట చేలల్లో వన్యప్రాణులను హత మార్చేందుకు విద్యుత్ తీగలను అమరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని చుంచుపల్లి గ్రామంలో గ్రామస్తులకు వన్యప్రాణుల వేట, విద్యుత్తు తీగల అమర్చడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

### 'బావికి మరమ్మతులు చేపట్టండి'

**కెరమెరి:** గ్రామానికి ఆనుకొని ఉన్న ఊట బావికి మరమ్మతులు చేయించాలని మండలంలోని శివగూడ గ్రామస్తులు ఎంపీడీవో కృష్ణ రావును కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామానికి మిషన్ భగీరథ నీరు తాగేందుకు యోగ్యంగా లేక బావి నీరు తాగుతున్నామని, కానీ బావి పక్కనే కాలువ ఉండడంతో వర్షం వచ్చినప్పుడు కాలువలో నీరు బావిలో చేరుతుందన్నారు. దీంతో బావి నీరు కలుషితమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బావికి అడ్డుగా గోడ కట్టి మరమ్మతులు చేయించాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో మరమ్మతుల కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ పటేల్ మానిక్‌రావు, ఈ జీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ ఐక్యానాయక్, టీఏలు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

### రక్తదాన శిబిరం

**కాగజ్‌నగర్‌రూరల్:** పుల్వామ దాడిలో అమరులైన ఆర్మీ జవానులను స్మరిస్తూ బుధవారం విజేత హాస్పిటల్‌లో ఇండియన్ మోక్షిత డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని వైద్యుడు విద్యాసాగర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఇండియన్ ఎక్స్ ఆర్మీ కెప్టెన్ నయీం, శివ, ఎక్స్ఆర్మీ సభ్యులు, ఉపాధ్యాయులు, తదితరులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్ కుమార్, శ్రీనివాస్, బిక్షపతి పాల్గొన్నారు.

# సమస్యల్లో ప్రభుత్వ పాఠశాల


లింగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల

- ప్రహరీ లేక పశువుల సంచారం
- ప్రయోగశాల, తరగతి గదుల కొరత
- తిప్పలు పడుతున్న లింగాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు


బెంచీలు లేక నేలపై కూర్చున్న విద్యార్థులు

**లింగాపూర్:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండడంతో గతేడాది పరీక్షల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. కానీ పాఠశాలలో కనీస వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులు తిప్పలు పడుతున్నారు.

**అనేక సమస్యలు...**

ప్రతీ విద్యా సంవత్సరంలో దాదాపు 160మందికి పైగా విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో కనీసం తాగునీటి వసతి కూడా లేకపోవడంతో మధ్యాహ్నం భోజనం అనంతరం విద్యార్థులు తాగునీటికి తిప్పలు పడుతున్నారు. పాఠశాల గోడలకు ఇప్పటికీ కలర్ వేయలేదు. గోడలు మొత్తం శిథిలావస్థకు చేరుకున్నాయి. తరగతి గదుల్లో ఫ్లోరింగ్ పగిలిపోయింది. పాఠశాల ఆవరణలో ఒక చేతిపంపు ఉండగా, దానికి కరెంట్ వైర్ బిగించి ఉండడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. కాగా పాఠశాలలో దశాబ్దాల క్రితం నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. పాఠశాలకు ప్రహరీ కూడా లేకపోవడంతో ఆవరణలో పశువుల సంచారం ఎక్కువగా ఉంది. ఫలితంగా మొక్కల సంరక్షణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు కూడా లేవు. సైన్స్ విద్యార్థులు నిర్వహించే ప్రయోగశాలకు ప్రత్యేక గదులు లేకపోవడంతో ఉన్న గదుల్లోనే సర్దుకోవాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలో విద్యా పరికరాలు, తదితర అవసరాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

**అదనపు గదులు నిర్మించాలి**



పాఠశాలలో సరిపడా తరగతి గదులు లేవు. తరగతులకు సరిపడా గదులు నిర్మించాలి. విద్యార్థులు కూర్చునేందుకు తరగతి గదుల్లో టేబుల్స్ ఏర్పాటు చేయాలి. అధికారులు స్పందించి పాఠశాలలో సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి.
– రాథోడ్ మమత, 10వ తరగతి

**సౌకర్యాలు కల్పించాలి**



మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించడంతో పాటు కొత్తగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలి. తాగునీటి సౌకర్యం కూడా కల్పించాలి
– జాదవ్ నవ్యశ్రీ, 9వ తరగతి

**ప్రభుత్వం ఆదుకోవాలి**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వం అదనపు గదులు నిర్మించాలి. పిల్లలు కూర్చోవడానికి బెంచీలు కూడా లేవు. ఒకే గదిలో 6వ, 7వ తరగతులకు చెందిన విద్యార్థులు నేలపై కూర్చుంటున్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి.
– శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు

# ఘనంగా వసంత పంచమి వేడుకలు


ఆసిఫాబాద్‌అర్బన్: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న పండితులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండితులు జంబోజు తిరుపతిచారి ఆధ్వర్యంలో పాఠశాలలో గణపతిపూజ, అష్టోత్తర శతనామావళి, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 50 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్‌రావ్, కార్యదర్శి వేణుగోపాల్, సహకార్యదర్శి మధుకర్, పోషకులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

**కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో..**

వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసంతో పాటు అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పిన్నా వివేక్, రూప్‌నార్ రమేశ్, శ్రీనివాస్, సుధాకర్, ఉదయ్, సోలంకి తదితరులు పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్‌రూరల్:** పట్టణంలోని బాలాజీనగర్, ద్వారకానగర్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలల్లో బుధవారం వసంతిపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరస్వతీ పూజ, చిన్నారులకు అక్షరభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, శిశుమందిరాల జిల్లా అధ్యక్షురాలు అనిత దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గణపతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**రెబ్బెన:** మండల కేంద్రంలోని ఎస్వీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం వసంత పంచమి వేడుకలను నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ చదువుల తల్లి సరస్వతీ దేవికి పూజలు చేశారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు పాల్గొన్నారు.

**చింతలమానెపల్లి:** మండలంలో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వసంత పంచమి పురస్కరించుకొని శుభ ముహూర్తాలు ఉండడంతో శుభకార్యాలు నిర్వహించారు. ఇళ్లల్లో శ్రీపంచమి పూజలు చేశారు. మండలంలోని రవీంద్రనగర్‌లో బెంగాలీలు సంప్రదాయంగా పూజలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైవేటు పాఠశాలల్లో సరస్వతి మాత విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. విద్యార్థులు ప్రత్యేకమైన సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరభ్యాసం**


సంప్రదాయ వస్త్రధారణలో బెంగాలీ చిన్నారులు

**పెంచికల్‌పేట్:** మండలంలోని ఎల్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో వసంత పంచమి పురస్కరించుకొని అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్, ఎంపీడీవో రమేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, పంచాయతీ కార్యదర్శి రాకేష్, అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, అంగన్‌వాడీ హెల్పర్ ప్రేమలత, చిన్నారులు పాల్గొన్నారు.

# పలువురు అధికారుల బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో రాజేందర్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో వరలక్ష్మి


బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ జ్యోత్స్న

జిల్లాలోని పలు మండలాల్లో బదిలీపై కొత్తగా వచ్చిన అధికారులు బుధవారం బాధ్యతలు చేపట్టారు.

**దహెగాం ఎంపీడీవోగా..**

**దహెగాం:** దహెగాం ఎంపీడీవోగా రాజేందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బెల్లంపల్లిలో విధులు నిర్వహిస్తున్న రాజేందర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

**వాంకిడి ఎంపీడీవోగా వి.వి వరలక్ష్మి..**

**వాంకిడి:** వాంకిడి మండల నూతన ఎంపీడీవోగా వి.వి వరలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మంచిర్యాల జిల్లా నెన్నెల మండల ఎంపీడీవోగా ఆమె విధులు నిర్వర్తించారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన కెరమెరి మండల ఎంపీడీవో ఆర్.మహేందర్ బదిలీపై మంచిర్యాల జిల్లాకు వెళ్లారు.

**తహసీల్దార్‌గా రోహిత్..**

మండల నూతన తహసీల్దార్‌గా డి.రోహిత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన రహీముద్దీన్ కామారెడ్డి జిల్లాకు వెళ్లారు.

**తిర్యాణి ఎంపీడీవోగా మల్లేశ్**

**తిర్యాణి:** మండల ఎంపీడీవోగా వేముల మల్లేశ్ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన ఎంపీడీవో సత్యనారాయణ మంచిర్యాల జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా దండెపల్లి ఎంపీడీవోగా పని చేసిన మల్లేశ్ వచ్చారు.

**రెబ్బెన తహసీల్దార్‌గా..**

**రెబ్బెన:** మండల నూతన తహసీల్దార్‌గా బుధవారం జ్యోత్స్న బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సమీర్ అహ్మద్‌ను సిద్దిపేట జిల్లాకు బదిలీ చేయగా ఆయన స్థానంలో జ్యోత్స్న రెబ్బెనకు వచ్చారు.

## సంక్షిప్త వార్తలు

**బాలేశ్వర ఆలయంలో కుంకుమార్చన**

**ఆసిఫాబాద్‌అర్బన్:** ఈనెల 16వ తేదీన జిల్లా కేంద్రంలోని బాలేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే రథోత్సవాన్ని పురస్కరించుకొని 10వ తేదీ నుంచి ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో అర్చకులు శ్రీధర్ ఆధ్వర్యంలో లలిత సహస్రనామోక్త కుంకుమ అర్చన, మన్యు సూక్త హోమాన్ని నిర్వహించారు.

**సమస్యలపై వెంటనే స్పందించాలి**

**కెరమెరి:** ప్రజలు విన్నవించే సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారం చేయాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి అన్నారు. బుధవారం నూతన ఎంపీడీవోగా విధుల్లోకి చేరిన కృష్ణారావును శాలువాతో ఘనంగా సన్మానించారు.

**అయోధ్యకు తరలివెళ్లిన భక్తులు**

**కాగజ్‌నగర్‌రూరల్:** అయోధ్యలోని బాలరాముడి దర్శనానికి బుధవారం ప్రత్యేక రైలులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 1400 మంది భక్తులు బుధవారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో డీఎస్పీ కరుణాకర్, సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ప్రత్యేక ఐడీ కార్డులు అందజేశారు. బీజేపీ నాయకుడు జాదవ్ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేయగా, కాగజ్‌నగర్ సేవా మంచ్ ఆధ్వర్యంలో బిస్కెట్స్, టీ, స్నాక్స్ పంపిణీ చేశారు.

### ఆటపాటలతో విద్యా బోధన చేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న కుమారి

**కెరమెరి:** ఆటపాటలతో చిన్నారులకు విద్యాబోధన చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి అన్నారు. బుధవారం మండలంలోని బాబేఝరి, పాట్నాపూర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. సకాలంలో రికార్డులు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఆమె వెంట అంగన్‌వాడీలు స్రవంతి, శ్యామల, అనసూయ ఉన్నారు.

# కార్మికుల సమ్మె జయప్రదం చేయండి



మాట్లాడుతున్న చాంద్ పాషా

**ఆసిఫాబాద్‌అర్బన్:** ఈ నెల 16వ తేదీన సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే దేశ వ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ చాంద్ పాషా పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనలకు పూనుకోవాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తయినా రైతాంగ, కార్మిక సమస్యలు పరిష్కరించలేదని ఆరోపించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు టి.శ్రీనివాస్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, నాయకులు వీరన్న, రాపల్లి రాజన్న, అఖిల్, అశోక్, నజీర్ పాల్గొన్నారు.

**సమ్మె విజయవంతం చేయాలి**

**వాంకిడి:** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహిస్తున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు గోగర్ల తిరుపతి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని జిన్నింగ్ మిల్లు కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్మికులు ముకేశ్, నాను, బాలు, సురేందర్, లక్ష్మి, మాయ పాల్గొన్నారు.

**సమ్మె పోస్టర్ ఆవిష్కరణ**

**రెబ్బెన:** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న దేశ వ్యాప్తంగా చేపట్టబోయే సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏఐటీయూసీ నాయకులు ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, గ్రామ పంచాయతీ కార్మికులు రమేశ్ పాల్గొన్నారు.

**హక్కుల సాధన కోసం విజయవంతం చేయాలి..**

సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధన కోసం కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కాంట్రాక్టు కార్మికుల సంఘం గోలేటి అధ్యక్షుడు రాయిల్ల నర్సయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఖైరిగూడ ఓసీపీలో గేట్‌మీటింగ్ నిర్వహించారు. నాయకులు రాజశేఖర్, మెంగు, వినోద్‌కుమార్, మహేందర్, భీమేష్, రేవంత్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్‌లో ఎన్నికల కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

**కాగజ్‌నగర్‌రూరల్:** మెదక్ లోక్‌సభ పరిధిలో గల మాసాయిపేట మండల కేంద్రంలో బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని బుధవారం సిర్పూర్ ఎమ్మెల్యే, మెదక్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, వివిధ జిల్లాల అధ్యక్షులు, పార్లమెంట్ కన్వీనర్లు, కోకన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** జైనూర్ మండలంలోని భూసిమెట్ట క్యాంపు గ్రామ సమీపంలో ఆటో, కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జైనూర్ మండలంలోని చింతకర్ర గ్రామానికి చెందిన పంద్ర భీంరావు(32)కు చెందిన ఆటోలో గ్రామానికి చెందిన విమలబాయి, జానుబాయి, సలాం జాకు, మడావి షేకు, వెడ్మ జైతు, ఉయిక మాన్కు, పంద్ర షేకులు కేస్లాపూర్ జాతరకు వెళ్లి మంగళవారం సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ఆసిఫాబాద్ నుంచి వస్తున్న కారు ఎదురుగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను స్థానికులు వెంటనే జైనూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉట్నూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ఆటో డ్రైవర్ భీంరావు చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య రాజ్యలక్ష్మి, ముగ్గురు సంతానం ఉన్నారు. కారులో ప్రయాణిస్తున్న ఆత్రం సుంగుది ఇంద్రవెల్లి మండలం వడ్‌గావ్ గ్రామం. ఉట్నూర్ మండలం లక్కెట్టిపేట గ్రామానికి చెందిన సెడ్మకి కృష్ణ కారులో ఆసిఫాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.

# 'ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్టు అప్రజాస్వామికం'


మాట్లాడుతున్న సిడాం గణపతి

**కాగజ్‌నగర్‌రూరల్:** రంగారెడ్డి జిల్లా దువ్వాడ వద్ద రాష్ట్ర పోలీసులు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్చి వద్ద జరిగిన గొడవలో క్షతగాత్రులను పరామర్శించేందుకు వెళ్లగా, పోలీసులు అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. నాయకులు శ్యాంరావు, మనోహర్, తిరుపతి, రాజ్‌కుమార్, పోచం, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

**సిర్పూర్(టి):** బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేయడం సమంజసం కాదని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుర్గం ప్రవీణ్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డోంగ్రె శుభం, వాయిజ్ హుస్సేన్‌లు పాల్గొన్నారు.


ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మహిళలు


దుర్గాదేవికి పూజలు చేస్తున్న అర్చకులు

## విగ్రహాల ప్రతిష్ఠాపన

కెరమెరి మండల కేంద్రంలో బుధవారం దేవతా మూర్తుల ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తుజాల్‌పురం మందిర సముదాయంలో దుర్గామాత, కోదండా రామచంద్రమూర్తి, శ్రీ కృష్ణ, విగ్రహాల ప్రతిష్ఠాపన జరిగింది. ఆలయ నిర్మాణ దాత లక్ష్మి నారాయణగౌడ్, ప్రవీణ్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు భజనలు చేశారు. – కెరమెరి


పూజలు చేస్తున్న భక్తులు